క్లుప్తంగా

లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు

మానవపాడు: బాలికలపై అత్యాచారం నేరమని హెడ్‌కానిస్టేబుల్ తిప్పన్న, చైల్డ్‌లేబర్ అధికారులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థినులకు లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రతిఒక్కరూ 18 సంవత్సరాలు నిండిన తర్వాత వివాహం చేసుకోవాలని సూచించారు. ర్యాగింగ్ చేస్తే పోలీసుల దృష్టికి తీసుకు రావాలన్నారు. బాలికలను పనుల్లో ఉంచితే మా దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి

గద్వాల: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు రావాల్సిన ప్రభుత్వపరమైన పరిహారాన్ని కొన్ని నెలలుగా అందడం లేదని వెంటనే బాధితులకు చెల్లించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఈ మేరకు వారు మంగళవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రావుకు వినతి అందజేశారు. కార్యక్రమంలో అశోక్, హనుమంతు, మన్యం తదితరులు ఉన్నారు.

మందుబాబుల హల్‌చల్

మానవపాడు: మందుబాబులు తాగి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని జల్లాపురం శివారు ప్రాంతంలోని మద్యం దుకాణం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ తిప్పన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూల్ జిల్లాకు చెందిన సత్యప్రకాశ్‌రెడ్డి మానవపాడు మండలంలోని జల్లాపురం స్టేజీ సమీపంలోని మద్యం దుకాణం వద్ద బీరు తీసుకోడానికి వెళ్లాడు. ఆ సమయంలో మానవపాడు మండలం పెద్దపోతులపాడుకు చెందిన ఓ వ్యక్తితో గొడవ పడ్డాడు. వారిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలియజేశారు.

రహదారి పనులు ప్రారంభం

ఉండవెల్లి: మండలంలోని కలుగోట్లలోని కస్తూర్బా పాఠశాలకు వెళ్లేందుకు రహదారి ఇబ్బందిగా ఉందని పలుమార్లు సమస్యను విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే విజయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే మంగళవారం రూ.5 లక్షల నిధులను రోడ్డుకు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు సకాలంలో రుచికరమైన భోజనం ఏర్పాటు చేయాలని ఎస్‌ఓ పరిమళకు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గజేందర్ రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

రాజోలి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత తూర్పు గార్లపాడు మాజీ సర్పంచ్ సంజన్న (70) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. 2004లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా సర్పంచ్‌గా గెలుపొందారు. గ్రామాభివృద్ధికి సంజన్న ఎంతో కృషిచేశారని ప్రజలు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేస్తానని, సంజన్న మృతి తనను ఎంతగానో కలిచివేసిందంటూ సంతాపం వ్యక్తం చేశారు.

మొక్కలను రక్షించుకోవాలి



వెల్దండ: మండలంలోని చెర్యూకార్‌లో మంగళవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను రక్షించాలన్నారు. చెట్లను కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం అమ్మ పేరు మీద మొక్కలను నాటించారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్, ఏపీఓ ఈశ్వర్‌జీ, ఏపీఎం రాములు, ఈసీ దేవేందర్, కార్యదర్శి బాల్‌రాజ్, ఫీల్డ్‌అసిస్టెంట్ కృష్ణయ్య, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మమ్మ, గ్రామస్తులు ఉన్నారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



ధరూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద..

ప్రభుత్వ ఆదేశాలమేరకు మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు అధికారికంగా నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయం, సింగిల్ విండో కార్యాలయం, గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు.

■ తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు వేర్వేరుగా నిర్వహించారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత తన నివాసం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక స్మృతివనంలో అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పించారు.



గట్టులో జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

■ ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాసరావు జాతీయ జెండా ఆవిష్కరించారు. - 'సాక్షి'నెట్‌వర్క్



అలంపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద..



మల్దకల్‌లో..



కేటీదొడ్డి పోలీస్ స్టేషన్‌లో..



మానవపాడులో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ భాస్కర్



అయిజలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ జ్యోతి



కొంకల జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

విద్యార్థులకు మందులు పంపిణీ



అలంపూర్‌లో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రామస్వామి



మానవపాడులో మందులు అందజేస్తున్న వైద్యసిబ్బంది

మానవపాడు: పోషణమాసం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని డాక్టర్ యాకుబ్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలో ఎత్తుకు తగ్గ, బరువు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఆరోగ్యకేంద్ర సూపర్‌వైజర్ చంద్రన్న, ఏఎన్‌ఎంలు జయమ్మ, దేవమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: క్యాతూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు రామస్వామి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయమ్మ, ఎంపీహెచ్‌ఈఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



అయిజలో జెండాను ఆవిష్కరిస్తున్న విశ్వ బ్రాహ్మణుల సంఘం మండల అధ్యక్షుడు రవి ప్రకాష్



గట్టులో ఊరేగింపు

అయిజ: మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మంగళవారం విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా విశ్వకర్మ భగవానుడికి సంబంధించిన జెండాను ఆవిష్కరించారు. అనంతరం వేదపండితులు యజ్ఞమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శేక్షావలి ఆచారి హాజరయ్యారు. రవి ప్రకాష్, ఖాళిదాసు, వీరేశ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దేవాలయంలో మంగళవారం విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణయ్యచారి, గెల్వలాచారి, వెంకటాచారి, జంగాచారి, శ్రీనివాసచారి, రామాచారి, కృష్ణామాచారి, రమేష్‌చారి, జగన్‌చారి, శివ, దినేష్, రాజయ్య, పద్మమ్మ ఉన్నారు.

గద్వాలటౌన్: జిల్లా కేంద్రంలో విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం భీంనగర్‌లోని కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విశ్వకర్మ చిత్రపటానికి ఆ సంఘం నాయకులు పూజలు చేశారు.

గట్టు: వివిధ గ్రామాలకు చెందిన విశ్వబ్రాహ్మణులు గట్టుకు చేరుకుని విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. అమ్మవారికి పంచామృతంతో అభిషేకం చేశారు. గట్టులోని కాళికాదేవి ఆలయం నుంచి విశ్వకర్మ చిత్రపటాన్ని ఊరేగింపుగా బస్టాండ్ వరకు తీసుకెళ్లారు. అనంతరం కాళికాదేవి ఆలయం వద్ద విశ్వకర్మ జెండాను ఆ సంఘం మండల అధ్యక్షుడు రాఘవేంద్రాచారి ఆవిష్కరించారు.

సమస్యలు పరిష్కరించాలి



ఏపీ జితేందర్‌రెడ్డికి వినతి అందిస్తున్న ఎంవీ ఫౌండేషన్ సభ్యుడు హనిమిరెడ్డి

గద్వాల: అలంపూర్ నియోజకవర్గంలో వడ్డేపల్లి, రాజోలి మండలాల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, దీని కారణంగా విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు లేక నష్టపోతున్నారని ఎంవీ ఫౌండేషన్ సభ్యుడు హనిమిరెడ్డి ఢిల్లీ అధికార ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డితో అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో వినతి అందజేశారు. అదేవిధంగా పాఠశాలల భవనాల మరమ్మతు, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

ఢిల్లీ అధికార ప్రతినిధికి సన్మానం

ఎర్రవల్లి: మండల కేంద్రంలో మంగళవారం ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఎర్రవల్లి కూడలిలో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి, వెంకటేష్ యాదవ్, పెద్ద లక్ష్మన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన



అయిజ: సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లిని అవమానించారంటూ మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట నిరసన తెలియజేశారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య మాట్లాడారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించే స్థానంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారని, తెలంగాణ రాష్ట్రానికి రాజీవ్ గాంధీతో సంబంధం ఏమి టని ప్రశ్నించారు. వీరేష్, తిమ్మప్ప, రమేష్ బాబు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బైక్ ఢీ

మానవపాడు: మండల కేంద్రం నుంచి జాతీయ రహదారికి వెళ్లే క్రమంలో ట్రాక్టర్ బైక్ ఢీకొని గాయాలైన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జల్లాపురానికి చెందిన సోడా బిస్మిలా, చందూరుకి చెందిన స్నేహితుడితో కలిసి జాతీయ రహదారిపై మానవపాడు వస్తుండగా.. మండల కేంద్రంలో.. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొట్టింది. దీంతో సోడా బిస్మిలాకు గాయాలవగా.. మానవపాడు ఆరోగ్యకేంద్రానికి తరలించి చికిత్స అందించారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం



గద్వాలలో తెలంగాణ విమోచన దినోత్సవంలో బీజేపీ నాయకులు



అయిజలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

గద్వాలటౌన్: గద్వాలలో వివిధ రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వేర్వేరుగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను ఆవిష్కరించారు. తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు.

■ గద్వాల పట్టణంలోని డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో...

తెలంగాణ ప్రాంతం నిజాం పాలన నుంచి విముక్తి పొందిన సెప్టెంబర్ 17ను ప్రభుత్వం విమోచన దినంగా ప్రకటించాలని ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

జెండా ఆవిష్కరించిన బీజేపీ నాయకులు

అయిజ: బీజేపీ నాయకులు మున్సిపాలిటీలో మంగళవారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జరుపుకొంటున్నట్లు బీజేపీ పట్టణ కన్వీనర్ ప్రదీప్ కుమార్, భగత్ రెడ్డి తెలియజేశారు.

వేడుకగా ప్రధానమంత్రి జన్మదినం



శాంతినగర్‌లో కేక్ కట్‌చేసిన నాయకులు

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి వేడుకలు చేసుకుని మిఠాయిలు పంచుతూ ప్రధానమంత్రికి శుభాకాంక్షలు తెలియజేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపద్మనాభ స్వామికి ప్రత్యేక పూజలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అనంతపద్మనాభ స్వామి వ్రతాన్ని వేదపండితులు రమేషాచారి, మధుసూదనాచారి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రమేషాచారి అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఎండోమెంటు ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరి, కవిత, ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, సీతరామిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రామచంద్రారెడ్డి, బాబురావుతో పాటు అర్చకులు దీరేంద్రదాసు, చంద్రశేఖర్‌రావు, నాగరాజు శర్మ తదితరులు పాల్గొన్నారు.



మల్దకల్‌లో అనంతపద్మనాభ స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మొక్కలే మానవాళికి జీవనాధారం



అయిజలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఎర్రవల్లి: మొక్కలే మానవాళికి జీవనాధారమని ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ అన్నారు. 'స్వచ్ఛత హి సేవా' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇటిక్యాల మండల పరిధిలోని మునుగాల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.

విద్యార్థులతో ప్రతిజ్ఞ

అయిజ: మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని బీజీఆర్ పాఠశాలలో మంగళవారం ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ సురేష్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

మానవపాడు: 'స్వచ్ఛత స్వభావం- స్వచ్ఛత సంస్కారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నేటి నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని ఆయా గ్రామాల వారీగా మొక్కలను నాటి పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అట్టహాసంగా ముగిసిన సౌత్‌జోన్ కబడ్డీ పోటీలు



టోర్నీ విజేత గద్వాల జట్టుకు బహుమతి అందజేస్తున్న బెటాలియన్ పోలీసు అధికారులు


గద్వాలటౌన్: గద్వాల ఆతిథ్యంతో స్థానిక ఎస్ఆర్ విద్యానికేతన్ వేదికగా నాలుగు రోజుల పాటు జరిగిన దక్షిణ భారత సౌత్‌జోన్-1 సీబీఎస్ఈ పాఠశాలల అండర్-14, అండర్-17, అండర్-19 బాలుర కబడ్డీ పోటీలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. అండర్-14 విజేతగా ప్రకాష్ విద్యానికేతన్ జట్టు, రన్నర్‌గా వెరిటాస్ సైనిక్ స్కూల్ జట్లు నిలిచాయి. అండర్-17 విజేతగా గద్వాలకు చెందిన ఎస్ఆర్ విద్యానికేతన్ జట్టు, రన్నర్‌గా శ్రీసుధా హైస్కూల్ జట్టు నిలిచాయి. అండర్-19 విజేతగా ప్రకాష్ విద్యానికేతన్ జట్టు, రన్నర్‌గా హీల్ జట్టు నిలిచింది.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి...

క్రీడాకారులు నిర్మాణాత్మకమైన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ.. జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా చాటాలని పదో పోలీస్ బెటాలియన్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం జరిగిన పోటీల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడల పట్టణంగా గద్వాల అభివృద్ధి చెందుతుందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి (డీవైఎస్ఓ) అధికారి బీఎస్ ఆనంద్ మాట్లాడుతూ.. ప్రతి క్రీడాకారుడికి క్రీడా స్ఫూర్తి ముఖ్యమని, దీనితోనే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అభిప్రాయపడ్డారు. అనంతరం గెలుపొందిన విజేతలకు మెమొంటోలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో బెటాలియన్ సీఐ వెంకటేశ్వర్లు, పాఠశాల డైరెక్టర్లు రాముడు, శ్రీకాంత్‌జోషి, ప్రిన్సిపాల్ వినోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకదంతాయ నమో నమః

భక్తిశ్రద్ధలతో గణనాథుల నిమజ్జనం



అలంపూర్‌లో నిమజ్జనానికి తీసుకెళ్తున్న గణనాథుడు



కాశీపూర్‌లో వేలంలో లడ్డూ దక్కించుకున్న మల్లికార్జున్



ఉండవెల్లి లడ్డూను దక్కించుకున్న దంపతులు

అయిజ/ అలంపూర్ రూరల్: లంబోదరాయ నమో నమః, జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటూ భక్తులు చేసిన నినాదాలతో పురవీధులు పులకించాయి. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని కొలువుదీరిన వినాయకులు 11 రోజుల పాటు భక్తులతో పూజలందుకొని, మంగళవారం నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అలంపూర్ పట్టణంలో అంబేడ్కర్ కాలనీ, న్యూప్లాట్స్, పాత బస్టాండ్, కట్టెలపేట వీధిలోని వినాయకులు నిమజ్జనం చేశారు.

■ అలంపూర్ మండల పరిధిలోని కాశీపూర్ ఛత్రపతి శివాజీ యూత్ లడ్డూ ప్రసాదం బహిరంగ వేలం వేశారు. వేలంలో గ్రామానికి చెందిన మల్లికార్జున్, గోవిందమ్మలు రూ.71 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం వెనుకాలో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద రూ.50 వేలకు పల్లె కోటేశ్వర్ రెడ్డి లడ్డూను దక్కించుకున్నాడు.

మానవపాడు: మండల కేంద్రంలోని జూబ్లీహిల్స్ వినాయకుడి వద్ద కొంకల రాముడు, దొడ్డరాముడు, మద్దిలేటి, లక్ష్మినాయుడు, రాకేష్ రూ.80 వేలకు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు.